సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025


పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు 8లో


అప్పన్నకు భీష్మ ఏకాదశి ఆర్జిత సేవలు 8లో


కేకే లైన్‌తో కూడిన వాల్తేరు డివిజన్ కొనసాగించాలి 8లో

న్యూస్‌రీల్

నులి పురుగులపై యుద్ధానికి సిద్ధం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన నిమిత్తం ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేయనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శనివారం రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పలు విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఈ మాత్రలు ఉచితంగా సరఫరా చేయనున్నామన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు, కళాశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేశామని వెల్లడించారు. జిల్లాలో 5,20,891 మంది విద్యార్థులకు మాత్రలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని, ఇందుకు 5,30,000 మాత్రలు సిద్ధం చేశామన్నారు. సోమవారం మాత్రలు వేసుకోలేని వారు 17వ తేదీన మ్యాప్ ఆఫ్ రౌండ్ కార్యక్రమంలో వేసుకోవాలన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు


చంద్రంపాలెం హైస్కూల్ వద్ద విద్యార్థులు

కొమ్మాది: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరంలో 9, 11 తరగతుల్లో మిగులు సీట్లకు శనివారం 5 కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ వై.ఎస్.ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయంతోపాటు చంద్రంపాలెం ఉన్నత పాఠశాల, బక్కన్నపాలెంలో గల సెయింట్స్ స్కూల్, విశాఖ వ్యాలీ స్కూల్, తోటగరువు జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 11వ తరగతి ప్రవేశానికి 663 దరఖాస్తు చేసుకోగా, 261 మంది, 9వ తరగతిలో ప్రవేశానికి 1,201 మందికి దరఖాస్తు చేసుకోగా 619 మంది హాజరయ్యారన్నారు. డీఈవో ప్రేమకుమార్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

విశాఖ ఆర్చ్ బిషప్‌గా ఉడుమల బాల



విశాఖ సిటీ: విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా ఉడుమల బాల నియమితులయ్యారు. ప్రస్తుతం వరంగల్ బిషప్‌గా ఉన్న ఆయన్ని పోప్ ఫ్రాన్సిస్ శనివారం నియమించారు. 1954, జూన్ 18న తెలంగాణ రాష్ట్రంలోని ఘన్‌పూర్‌లో జన్మించిన ఉడుమల బాల 1979, ఫిబ్రవరి 20న ప్రీస్ట్‌గా నియమితులయ్యారు. అలాగే రోమ్‌లోని ఆల్ఫోన్సియన్ అకాడమి నుంచి మోరల్ థియోలజీలో డాక్టరేట్ పట్టా పొందారు. 1994 నుంచి 2006 వరకు ఆయన హైదరాబాద్‌లోని సెయింట్ జాన్స్ రీజనల్ సెమినరీలో మోరల్ థియాలజీ ప్రొఫెసర్‌గా, రెక్టార్‌గా పనిచేశారు. 2013, ఏప్రిల్ 13న ఉడుమల బాలను పోప్ ఫ్రాన్సిస్ వరంగల్ బిషప్‌గా నియమించారు. తాజాగా విశాఖ ఆర్చ్ బిషప్‌గా నియమితులైన ఆయన క్యాథలిక్ జనాభా విద్య, ఆరోగ్య, సంరక్షణ, సామాజిక సేవలకు అంకితమైన సంస్థలను పర్యవేక్షించనున్నారు.

దివ్యాంగుల క్రికెట్ జట్ల ఎంపికలు


నెట్స్‌లో పాల్గొన్న క్రీడాకారుడు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా డిజేబుల్డ్ క్రికెట్ జట్ల ఎంపిక శనివారం వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్‌లో జరిగింది. ఫిజికల్లీ డిజేబుల్డ్, మూగ కేటగిరీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. డిఫరెంట్లీ డిజేబుల్డ్ క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. తొలి విడతగా ఈ ఎంపికలు నిర్వహించామని, రెండో విడత మరోసారి నిర్వహిస్తామని ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ సూర్యానారాయణ, సభ్యుడు సుబ్బారావు తెలిపారు. ఏసీఏ అపెక్స్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కేశినేని శివనాథ్, సాన సతీష్‌బాబు సహకారంతో ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో ఎంపికలు జరిగాయని, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ అంధుల వీల్‌చైర్ కేటగిరీల్లోనూ ఎంపిక నిర్వహిస్తామన్నారు. ఎంపిక చేసిన జట్లను మూడు గ్రూప్‌లుగా విభజించి పోటీలు నిర్వహించనున్నామన్నారు.


డ్రెయిన్ పనులకు శంకుస్థాపన శిలాఫలకం



గెడ్డలపై వాలిన గద్దె!

- టీడీఆర్‌ల కోసం మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు దరఖాస్తు
- వెంటనే సీఎంవో నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు
- సర్వే చేసి అది ప్రభుత్వ స్థలమని తేల్చిన రెవెన్యూ వర్గాలు
- అయినా టీడీఆర్ ఇవ్వాలంటూ ప్రణాళిక విభాగం సిఫార్సు
- రూ.24 కోట్ల టీడీఆర్‌ల కోసం మంత్రాంగం
- సీఎం కార్యాలయం నుంచి ఒత్తిళ్లతోనేనని విమర్శలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

జీవీఎంసీ పరిధిలో విలువైన స్థలాలపై కన్నేసి ఎక్కడికక్కడ కొట్టేస్తున్న కూటమి నేతలు.. ఇప్పుడు గెడ్డలపై వాలిపోతున్నారు. కప్పరాడ గ్రామ రెవెన్యూ పరిధి మురళీనగర్ సర్వే నెంబరు 41/4లోని 19 సెంట్ల గెడ్డ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు ప్రయత్నిస్తున్నారు. ఈ స్థలంలో టీడీపీ నేత కంభంపాటి రామ్మోహన్‌రావుతో పాటు తన సంస్థలకు చెరో 50 శాతం వాటా ఉందని.. ఈ స్థలానికి ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇవ్వాలంటూ నేరుగా సీఎం చంద్రబాబుకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసిన మూడు రోజుల్లోనే నివేదిక ఇవ్వాలంటూ సీఎం ఓఎస్‌డీ అధికారులను ఆదేశించారు. దీంతో ఆ స్థలంలో జీవీఎంసీ సర్వే బృందంతో పాటు రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. రికార్డుల ప్రకారం ప్రభుత్వ స్థలంగా ఉందని... ఇక్కడ సహజ సిద్ధంగా ప్రవహించే మురుగుకాలువ కూడా ఉందని నివేదికలో పేర్కొన్నట్టు తెలుస్తోంది. అయితే ఈ నివేదికను పక్కన పెట్టి.. ఆ స్థలానికి నాలుగు రెట్ల విలువైన టీడీఆర్‌లు.. అంటే రూ. 24 కోట్ల విలువైన బాండ్లు అప్పగించేందుకు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఈ స్థలంలో ఇప్పటికే రూ.1.19 కోట్లతో మురుగుకాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటన్నింటినీ దాచేస్తూ రూ.24 కోట్ల టీడీఆర్‌లను కట్టబెట్టేందుకు ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో జీవీఎంసీ అధికారులు సిద్ధమవుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.


ప్రణాళిక విభాగ అధికారుల అత్యుత్సాహం!

ఓకవైపు పక్కాగా సర్వే చేసి ప్రభుత్వ స్థలమని చెబుతున్నా.. ఈ ప్రాంతంలో రూ.1.19 కోట్లతో డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నా.. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు మాత్రం టీడీఆర్‌లు కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. సీఎం కార్యాలయం నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలోనే జీవీఎంసీ ప్రణాళిక విభాగం అధికారులు టీడీఆర్‌లు ఇవ్వాలంటూ నివేదించినట్టు సమాచారం. డ్రెయిన్ విస్తరణలో భాగంగా 41/4లో స్థలం కూడా అవసరమవుతుందని.. అందువల్ల ఈ స్థలానికి టీడీఆర్ ఇవ్వవచ్చని పేర్కొంటూ జోన్–5 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శాస్త్రి షణ్ముఖ్ నివేదిక సిద్ధం చేసి సమర్పించినట్టు విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి 41/4లోనే డ్రెయిన్ ఉందని స్వయంగా జీవీఎంసీ సర్వేతో రెవెన్యూ రికార్డులు చెబుతున్నా.. ఈ సర్వే నెంబరులో డ్రెయిన్‌కు సంబంధం లేదనే రీతిలో నివేదిక సిద్ధం కావడం గమనార్హం. మొత్తంగా రూ.24 కోట్ల టీడీఆర్ కట్టబెట్టడానికి రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.


టీడీఆర్ చెల్లించడానికి వీలుగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఇచ్చిన ఉత్తర్వులు


టీడీఆర్ మంజూరు చేయాలని గద్దె బాబూరావు చేసిన దరఖాస్తు

అంతా ప్రభుత్వ స్థలమే..!


సర్వే నెంబర్ 41/4 ప్రభుత్వ స్థలమని గుర్తిస్తూ నివేదిక

ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు కావడంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. 41/4 సర్వే నెంబరులోని 19 సెంట్లలో సర్వే చేసి స్కెచ్‌లను కూడా సిద్ధం చేశారు. సర్వే చేసిన రెవెన్యూ అధికారులు మాత్రం రికార్డుల ప్రకారం ఇది ప్రభుత్వ స్థలంగా ఉందని.. మొత్తం 19 సెంట్ల (920 చదరపు గజాలు)లో.. 113 గజాల్లో శ్మశానం, 49 గజాల్లో షెడ్లు, 545 గజాల్లో సహజంగా పారే మురుగుకాలువ, 2 చదరపు గజాల్లో బాత్రూంలు ఉండగా... 211 గజాలు మాత్రం ఖాళీగా ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ సర్వే నెంబరు 41/4 మొత్తం ప్రభుత్వ స్థలమని, రికార్డుల్లో కూడా 22 ఏ జాబితాలో ఉందంటూ నివేదిక సమర్పించారు. అయితే ఈ నివేదికను పక్కన పెట్టి టీడీఆర్‌లు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండడం గమనార్హం.

లోకేష్ బస చేశారంటూ!

రెవెన్యూ రికార్డుల మేరకు ఈ స్థలం ప్రభుత్వానిదని స్పష్టంగా ఉంది. 22ఏ జాబితాలో కూడా ఈ సర్వే నెంబరు ఉంది. అయినప్పటికీ ఈ స్థలం తనతో పాటు కంభంపాటి రామ్మోహనరావుకు చెందినదని, ఈ ప్రాంతంలో 2024 ఫిబ్రవరి 17వ తేదీన లోకేష్ బస్సులో బస కూడా చేశారంటూ మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు దరఖాస్తులో పేర్కొన్నారు. తనకు చెందిన గాల్వన్ టెక్నో సొల్యూషన్, కంభంపాటికి చెందిన లక్ష్మీ టెక్నో సొల్యూషన్ సంస్థలకు చెరో 50 శాతం చొప్పున ఈ స్థలంలో వాటా ఉందని వివరించారు. అంతేకాకుండా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కూడా ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా 2024 జనవరి 5న ఇక్కడ భోజనం చేసి బస కూడా చేశారని పేర్కొన్నారు. అందువల్ల ఈ స్థలం తమదేనని పేర్కొంటూ టీడీఆర్‌లు ఇవ్వాలంటూ కోరారు. ఈ మేరకు 2024 డిసెంబరు 21న నేరుగా సీఎం చంద్రబాబుకు దరఖాస్తు సమర్పించారు. దీనిపై 3 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని సీఎం ఓఎస్‌డీ అధికారులను 2024 డిసెంబరు 24న ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా జీవీఎంసీలో ఆ దరఖాస్తు చకచకా కదులుతోంది.

జాతీయ రహదారులకు 220 మీటర్లలోపు మద్యం షాపు ఏర్పాటు చేయకూడదు!

ఇవి స్పష్టంగా దేశ అత్యున్నత న్యాయస్థానం జారీచేసిన ఆదేశాలు!!

హోం మంత్రి నియోజకవర్గంలో మాత్రం సుప్రీంకోర్టు ఆదేశాలనూ తూచ్ అంటున్నారు. జాతీయ రహదారి-16కు కేవలం 120 మీటర్ల దూరంలోనే అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండల పరిధిలోని పెదగుమ్ములూరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఏఆర్‌కే వైన్స్‌కు మాత్రం ఈ నిబంధనలు ఏవీ వర్తించడం లేదు. ఎందుకంటే ఇది హోం మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం. అధికార పార్టీ నేతలకు కొమ్ము కాస్తూ ఎక్సైజ్ అధికారులు కాస్తా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించి ఏకంగా టెంపరరీ లైసెన్స్‌తో పాటు పర్మినెంట్ లైసెన్స్ కూడా జారీచేశారు.

నిబంధనలకు విరుద్ధంగా హైవేకి సమీపంలో ఏఆర్‌కే వైన్స్




హోం మంత్రి ఇలాకాలో బెల్టుషాపులకు మద్యం రవాణా చేస్తూ పట్టుబడ్డ ఆటో(ఫైల్)

• అక్రమాలకు 'లైసెన్స్'

ఎక్సైజ్.. జీ హుజూర్

- ఏఆర్‌కే వైన్స్‌కు అధికారులు దాసోహం
- ఎన్‌హెచ్‌కు 120 మీటర్ల దూరంలోనే మద్యం షాపు
- అయినా పర్మినెంట్ లైసెన్స్ మంజూరు
- సుప్రీంకోర్టు ఆదేశాలూ బేఖాతరు
- హోంమంత్రి ఇలాకాలోనే ఇష్టారాజ్యం
- ఫిర్యాదుతో తీరిగ్గా నోటీసు జారీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

వైన్స్ షాపులోని మొదటి అక్షరం ఏ అంటే హోం మంత్రి అనిత అనుకున్నారో ఏమో కానీ ఏకంగా సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ఎక్సైజ్ అధికారులు పక్కన పెట్టి ఏఆర్‌కే వైన్స్‌కు దాసోహం అన్నారు. మరోవైపు పక్కనే ఎస్‌వీడీ వైన్స్ 160 మీటర్లలోపు ఉంది. దానిని వెంటనే మార్చేయాలంటూ స్వయంగా ఎక్సైజ్ ఉన్నతాధికారులు టేపు పెట్టి మరీ కొలిచి దూరంగా తరలించడం గమనార్హం. దీనిపై నేరుగా ఎక్సైజ్ ఉన్నతాధికారులతో పాటు లోకాయుక్తకు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో తాజాగా 5 రోజుల క్రితం సదరు వైన్ షాపునకు ఎక్సైజ్ అధికారులు నోటీసులు జారీ చేయడం గమనార్హం.



బెల్టు దుకాణాలకు భారీగా...!

మరోవైపు భారీగా బెల్టు దుకాణాలకు కూడా మద్యాన్ని గుడివాడలో ఉన్న మరో ప్రైవేటు మద్యం దుకాణం కేకే వైన్స్ యాజమాన్యం తరలిస్తోంది. ఏకంగా 47 కేసుల బ్రాందీతో పాటు 1380 బీరు సీసాలను ఆటోల్లో తరలిస్తుండగా 27 జనవరి 2025న గ్రామస్తులు పట్టుకుని పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చివరకు ఆధారాలతో సహా నేరుగా ఎస్పీకి ఫిర్యాదు వెళ్లడంతో స్థానిక ఎస్ఐ కేసు నమోదు చేశారు. 30 కేసులు దాటి బెల్టు షాపులకు మద్యాన్ని తరలిస్తున్నట్టు తేలితే సదరు మద్యం దుకాణ లైసెన్స్‌ను రద్దు చేసే అధికారం ఉంది. అయినప్పటికీ ఇప్పటివరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వైన్ షాపు కూడా టీడీపీ నేతలకు చెందినది కావడమే ఇందుకు కారణమన్న విమర్శలున్నాయి. ఈ వైన్ షాపు కూడా హోం మంత్రి నియోజకవర్గంలోనే ఉండడం గమనార్హం.

నోటీసులు జారీ చేశాం



జాతీయ రహదారికి 220 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన ఏఆర్‌కే వైన్స్‌కు ఈ నెల 3వ తేదీన నోటీసులు జారీచేశాం. సమాధానమిచ్చేందుకు 10 రోజుల సమయం ఇచ్చాం. ఆ తర్వాత నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా పర్మినెంట్ లైసెన్స్ మంజూరు చేసిన అధికారులకు కూడా నోటీసులు జారీచేశాం. –సుధీర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అనకాపల్లి జిల్లా

వీరికి ఓకే... వారికి 'నో'...!

ఈ ఏఆర్‌కే వైన్ షాపు నుంచి చూస్తే జాతీయ రహదారి కనిపిస్తుంది. జాతీయ రహదారి వెంట వెళ్లే వాహనాలు కూడా కనిపిస్తుంటాయి. మొదట్లో టెంపరరీ లైసెన్స్ మంజూరులో పక్కాగా పట్టించుకోకపోయినప్పటికీ... పర్మనెంట్ లైసెన్స్ మంజూరు సమయంలోనైనా అధికారులు పక్కాగా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వైన్ షాపును జాతీయ రహదారికి కేవలం 120 మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పర్మనెంటు లైసెన్సును కూడా జారీచేశారు. మరోవైపు అక్కడికి దగ్గరిలోని మరో వైన్ షాపును మాత్రం 220 మీటర్లకు అవతల ఏర్పాటు చేయాల్సిందేనంటూ ఎక్సైజ్ ఈఎస్ సుధీర్ స్వయంగా టేపు పట్టి కొలిచి మరీ మార్చిన తర్వాతే పర్మనెంట్ లైసెన్స్‌ను మంజూరు చేయడం గమనార్హం. అయితే, తమ షాపును మార్చినట్టుగానే...తమకంటే జాతీయ రహదారికి ఇంకా దగ్గరగా ఉన్న ఏఆర్‌కే వైన్స్‌ను కూడా మార్చాలంటూ మరో ప్రైవేటు వైన్‌షాపు (ఎస్‌వీడీ) యాజమాన్యం అధికారులను కోరింది. అయినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. మరోవైపు ఏఆర్‌కే వైన్స్‌కు పర్మనెంటు లైసెన్స్‌ను కూడా జారీచేశారు. ఈ వైన్‌షాపు స్థానికంగా టీడీపీ నేతలకు చెందినది కావడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ వైన్‌షాపు లైసెన్స్‌దారుడు కోయిలాడ కమల్ చంద్రతో పాటు ఇందులో స్థానిక రాయవరం మండల నేత అబద్దంతో పాటు తన పీఏగా తొలగించానని హోం మంత్రి అనిత చెబుతున్న జగదీశ్‌కు కూడా వాటాలున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు కూడా చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



క్రికెట్ బెట్టింగ్ కేసులో కీలక నిందితుడు అరెస్ట్

- ఇప్పటివరకు 11 మంది ఆటకట్టించిన పోలీసులు
- తాజాగా గోవాలో ఏ2 ఎస్‌కే జిలానీ పట్టివేత
- 137 బ్యాంక్ అకౌంట్ల ద్వారా రూ.400 కోట్ల లావాదేవీలు గుర్తింపు

విశాఖ సిటీ: క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో కీలక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే వరకు 11 మంది నిందితులను కటకటాల్లోకి పంపించిన పోలీసులు.. తాజాగా గోవాలో దాక్కున్న ఏ2 ఎస్‌కే జిలానీని సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పెదవాల్తేరులోని డాక్టర్ కాలనీలో ఒక అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని విచారించగా దీని వెనుక పెద్ద ముఠా ఉన్నట్లు గుర్తించారు. ఒకరి ద్వారా మరొకరి సమాచారం తెలుసుకుంటూ ఇప్పటి వరకు 11 మందిని అరెస్టు చేశారు. ఇప్పటికే కీలక సూత్రధారి ఏ1 అడ్డూరి సుఖవర్మను పోలీసులు రిమాండ్‌కు పంపించగా.. తాజాగా మరో కీలక నిందితుడు ఏ2 ఎస్.కె.జిలానీని సైబర్ క్రైమ్ పోలీసులు గోవాలో అరెస్టు చేశారు. వారు ఉపయోగించిన బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా 137 అకౌంట్ల ద్వారా రూ.400 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. మరిన్ని అకౌంట్లను పరిశీలించాల్సి ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో ఏ3గా లగుడు రవికుమార్, ఏ6గా గుడ్డాల రమణ, ఏ7గా కోరాడ శ్రీనివాసరావు, ఏ8గా గెద్దం మహేష్, ఏ9గా మడకా రామకృష్ణ, ఏ10గా ఆరిపాక శ్రీనాథ్, ఏ11గా కాట్రు సిమ్రాన్ జోత్సింగ్, ఏ12గా కండికట్టు కమల్నాద్, ఏ15గా దూడరాజు, ఏ16గా సోమరాజు సతీష్‌లను పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంచాలి

సిటూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు బేబీరాణి డిమాండ్

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం పథకం, వీవోఏ ఆర్పీ, స్కూల్ ఆయాలు తదితర కార్మికులందరికీ వేతనాలు పెంచాలని సిటూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. జగదాంబ జంక్షన్ సమీపంలో గల సిటూ కార్యాలయంలో శనివారం స్కీమ్ వర్కర్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు స్కీం వర్కర్స్ అందరికీ కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం స్కీం వర్కర్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలు కూడా కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. నానాటికీ పని భారాన్ని పెంచుతూ కార్మికులను ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. పలు ప్రాంతాల్లో రాజకీయ వేధింపులతో స్కీం వర్కర్లను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున చలో విజయవాడకకు తరలివస్తామని హెచ్చరించారు. సదస్సులో సిటూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.మణి, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, కార్యదర్శి దేవి, ఆశ యూనియన్ అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి మేరీ, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు భవాని మంగశ్రీ, వీవోఏ జిల్లా అధ్యక్షురాలు అపర్ణ, కార్యదర్శి కంచమ్మ, ఇంటి పనివారి సంఘం నాయకురాలు కుమారి, ఆర్పీల సంఘం నాయకులు మల్లీశ్వరి, ఝాన్సీ, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కో–కన్వీనర్ సీతాలక్ష్మి, పెద్ద ఎత్తున స్కీం వర్కర్లు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న బేబీరాణి

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

అగనంపూడి: ఉద్యోగం రాలేదని మానసికంగా ఇబ్బందులు పడుతున్న యువకుడు దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం శ్రీహరిపురానికి చెందిన కల్లెంటి బాలన్ కుమారుడు రాదేష్ (37) చిన్నప్పటి నుంచి ఒంటరిగా ఉండడాన్ని ఇష్టపడేవాడు. ఉద్యోగం రాలేదని మానసిక వేదన అనుభవిస్తున్నాడు.. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో నిరాకరిస్తూనే ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లోనే ఫోన్ విడిచిపెట్టి బయటకు వచ్చేశాడు. అగనంపూడి సమీపంలోని రైలు కింద పడి ఆత్మహత్యకు చేసుకున్నాడు. ప్యాంట్ జేబులో దొరికిన పర్స్ ఆధారంగా మృతుని వివరాలు లభ్యమయ్యాయి. జేబులో ఉన్న లేఖను పోలీసులు గుర్తించారు. తన మృతికి ఎవరూ కారణం కాదని, అన్నయ్య పిల్లలు బాగా చదువుకోవాలని, పైనుంచి మిమ్మల్ని చూస్తుంటానని అందులో రాసి ఉంది. మృతునికి ముగ్గురు సోదరులు. సంఘటనా స్థలానికి జీఆర్పీ సిబ్బంది చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీ లెట్యూస్..సెల్యూట్



సాగరం అనంత నిధి. మత్స్య సంపదకు, అనంతమైన నిధులకు నిలయం. సముద్రం లోపల, రాళ్లపై మొలిచే మొక్కలు ఎంతో కనువిందు చేస్తాయి. ఇవి చూడటానికి అందంగా కనిపించడంతో పాటు అనేక పోషక విలువలను సైతం కలిగి ఉంటాయి. వీటిని సీ లెట్యూస్‌గా పిలుస్తారు. మనం సాధారణంగా ఆహారంలో భాగంగా చేసుకునే పాలకూరతో సమానంగా వీటిని పరిగణిస్తారు. వీటిని నేరుగా ఆహారంలో భాగం చేసుకోవడంతో పాటు, వ్యవసాయం, ఫార్మాస్యూటికల్, ఔషధ రంగంలో కూడా వినియోగిస్తారు. మన దేశంలో సైతం ఇటీవల కాలంలో సముద్రపు మొక్కలు, నాచు నుంచి పోషకాహారంగా నిలిచే బిస్కెట్లు వంటివి తయారు చేస్తున్నారు. విశాఖ తీరంలో ఇటీవల సముద్రం కొంత వెనక్కి వెళ్లింది. దీంతో రాళ్లపై మొలిచిన సముద్రపు మొక్కలు బయటకు దర్శనమిచ్చాయి. రాతిని మొత్తం కప్పేసి ఆకుపచ్చని తివాచీని తలపించే విధంగా ఈ సముద్రం మొక్కలు కనువిందు చేశాయి. చేతితో తాకితే మెత్తని స్పర్శతో ఇవి పర్యాటకులను ఆకట్టుకున్నాయి. వీటిని సాక్షి తన కెమెరాలో బంధించింది.

–ఏయూక్యాంపస్, ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గిరిజన ద్రోహి చంద్రబాబు

- 1/70 చట్టం రద్దుకు కుట్ర
- 11, 12 తేదీల్లో ఏజెన్సీని స్తంభింపజేస్తాం
- వైఎస్ జగన్ హయాంలో పారిశ్రామికాభివృద్ధి
- ఎమ్మెల్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు



సాక్షి, విశాఖపట్నం: సాక్షి, విశాఖపట్నం: మన్యం అభివృద్ధిని అడ్డుకుంటున్న చంద్రబాబు గిరిజన ద్రోహి అని ఎమ్మెల్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు అన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగ బద్ధంగా లభించిన 1/70 హక్కును టూరిజం పేరిట హరించేందుకు కుట్రపన్నుతున్నారని, ఆ హక్కును కాపాడుకోవడానికి ఈ నెల 11, 12 వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, ఆదివాసీ సంఘాలు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తామని తెలిపారు. 1/70పై స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలను మన రాష్ట్రంలోనే కాకుండా..దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో ఉండే ఆదివాసీ బిడ్డలు, సంఘాలు తీవ్ర స్థాయిలో ఖండిస్తున్నట్లు చెప్పారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేస్తున్న తప్పులను, వైఫల్యాలను మా నాయకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండగడుతున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబుకు, మంత్రులకు దమ్ముంటే మా నాయకుడు అడిగిన ప్రతి ప్రశ్నకు సరైన ఆధారాలతో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్‌లో ఒక్క హామీని సక్రమంగా అమలు చేయడం లేదని, దీనిపై పవన్‌కల్యాణ్ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. పథకాలు అమలు చేయకపోతే ప్రశ్నించండని చెప్పిన చంద్రబాబు ఇప్పుడెందుకు ఆర్థిక పరిస్థితి బాగోలేదని సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. గిరిజనుల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం పనిచేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అవాకులు,చవాకులు మాట్లాడితే గిరిజనులంతా తిరగబడతారని హెచ్చరించారు. గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరిజనుల సంక్షేమంపై దృష్టి సారించాల్సింది పోయి..గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం పనిచేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు. ఆమె 1/70 కోసం పోరాడితే బాగుంటుందని తెలిపారు.

కేకే లైన్‌తో కూడిన వాల్తేరు డివిజన్ కొనసాగించాలి

సీపీఎం నేతల డిమాండ్



రైల్వేస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాటిచెట్లపాలెం: కేకే లైన్, అరకుతో కూడిన వాల్తేర్ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా వామపక్షాలు, ప్రజాసంఘాలు, రైల్వే ఉద్యోగ సంఘాలు పోరాడుతున్నాయని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. విశాఖ కేంద్రంగా విశాఖపట్నం డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు తీసుకున్న కేంద్రం నిర్ణయాన్ని సీపీఎం జిల్లా కమిటీ స్వాగతిస్తోందని, కానీ కేకే లైన్‌తో కూడిన డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం విశాఖ రైల్వేస్టేషన్ వద్ద ఈమేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు మాట్లాడుతూ కేకే లైన్, అరకుతో కూడిన వాల్తేర్ డివిజన్ మొత్తాన్ని నూతన విశాఖపట్నం డివిజన్‌లో కొనసాగించాలని, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డును విశాఖలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేకే లైన్‌లో సరకు రవాణా ద్వారా ఏడాదికి రూ.10,500 కోట్ల ఆదాయం ఆర్జిస్తోందని, ఇప్పుడు దీనిని రాయగడలో కలపడం వలన విశాఖకు నష్టమేనన్నారు. కేంద్ర నిర్ణయంతో అరకు అభివృద్ధి మొత్తం ఒడిశా చెప్పుచేతుల్లో ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు వెంటనే జోక్యం చేసుకుని, యథావిధిగా కేకేలైన్ మొత్తం విశాఖ డివిజన్‌లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, ఉరుకూటి రాజు, ఎల్‌జే నాయుడు, యుఎస్ఎన్ రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రీల్స్ పిచ్చి..!

- మైనర్‌ను ట్రాప్ చేసిన యువకుడు
- రెండుసార్లు వివాహం చేసుకున్న వైనం
- భార్గవ్‌పై పోక్సో కేసు నమోదు

సీతమ్మధార: సెల్‌ఫోన్లకు బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్న రోజులివి. రీల్స్ పిచ్చి ఓ మైనర్ తల్లిదండ్రులను తలెత్తుకోకుండా చేస్తే..మరో యువకుడ్ని కటకటాలపాల్జేసింది. ఫోర్త్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఆ వివరాలు..తాటిచెట్లపాలెం రెడ్డివీధికి చెందిన 15 ఏళ్ల బాలికకు రీల్స్ అంటే పిచ్చి..నిత్యం రీల్స్ చేయడం.. వాటిని ఇన్‌స్టాలో పోస్ట్ చేయడం అలవాటు. ఈ క్రమంలో సమీప ఇంట్లో ఉంటున్న భార్గవ్..బాలిక చేసిన రీల్స్ చూసి లైక్ కొట్టాడు. క్రమంగా ఇన్‌స్టాలోనే పరిచయం పెంచుకున్నాడు. ఫోన్ నంబర్ తీసుకున్నాడు. తనకు రీల్స్ చేయాలని ఉందని, దానికి సహకరించాలని బాలికను కోరాడు. లేదంటే చనిపోతానని బెదిరించాడు. దీంతో ఇటీవల కైలాసపురం కొండమీద గల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వీరిద్దరూ కలుసుకున్నారు. జనవరి 9వ తేదీన మళ్లీ అదే ప్రదేశంలో కలుసుకుని బలవంతంగా బాలిక మెడలో తాళి కట్టాడు. ఆ తరువాత కొద్ది రోజులకు మళ్లీ సదరు బాలికను సింహాచలం తీసుకువెళ్లి అక్కడ మరోమారి వివాహం చేసుకున్నాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫోర్త్ టౌన్ పోలీసులు భార్గవ్‌పై పోక్సో, బాల్యవివాహ నిరోధక చట్టం, ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. భార్గవ్ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఆ యువకుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసును ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట-విజయవాడ సెక్షన పరిధిలో జరుగుతున్న నాన్-ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు, లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖపట్నం (18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12వ తేదీ నుంచి 22వ తేదీ వరకు, టాటానగర్-యశ్వంత్‌పూర్(18111) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13వ తేదీన, యశ్వంత్‌పూర్-టాటానగర్(18112) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9, 16వ తేదీల్లో రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు

షాలిమర్-హైదరాబాద్- షాలిమర్ (18045/46) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు మళ్లించబడిన మార్గంలో వయా సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తాయి.

- ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి-భువనేశ్వర్-ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి (11019/11020)కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మళ్లించబడిన మార్గంలో వయా వాడి, వికారాబాద్, సికింద్రాబాద్, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తాయి.
- షాలిమర్-సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19వ తేదీన మళ్లించబడిన మార్గంలో వయా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, సికంద్రాబాద్ మీదుగా నడుస్తుంది.

వందేభారత్ రీ షెడ్యూల్

ఈ నెల 19, 20వ తేదీల్లో ఉదయం 5.45 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం- సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా ఉదయం 7.15 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 19, 20వ తేదీల్లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్-విశాఖపట్నం(20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.15గంటలకు బయల్దేరుతుంది.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

- విశాఖపట్నం-కిరండూల్(58501) పాసింజర్ ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు దంతేవాడ నుండి బయల్దేరుతుంది.
- విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. ఈ తేదీల్లో ఈ రైళ్లు దంతేవాడ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించవు.

ఏపీజేయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా కంచర్ల అచ్యుతరావు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు యూనియన్(ఏపీజేయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా విశాఖకు చెందిన ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో జరిగిన సమావేశం అనంతరం కంచర్లను గౌరవాధ్యక్షునికి నియమిస్తూ.. అధ్యక్షుడు వాసుదేవ నాయుడు, జనరల్ సెక్రటరీ చాలాది పూర్ణ చంద్రరావు, సీనియర్ ఉపాధ్యక్షుడు ఎన్.ఎస్.వెంకటరమణ, ట్రజరీ ఆర్టీ ప్రసాద్‌ల సమక్షంలో నియామక ఉత్వర్వులు అంజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి కృషి చేయడంతోపాటు, సభ్యుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మందులకు...రోగులకూ ఒక్కటే...



కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో ఇటువంటి దృశ్యాలు సర్వసాధారణంగా మారిపోతున్నాయి. రోగు లను ఒక వార్డు నుంచి మరొక వార్డుకు, వైద్య పరీక్షలకు తరలించడానికి వీల్ చైర్లను వినియోగిస్తారు. ఉత్తరాంధ్రకు పెద్ద దిక్కుగా నిలిచే కేజీహెచ్ లో రోగులకు తగినన్ని మౌలిక వసతుల పూర్తిస్థాయిలో లేవు. అయితే అదే సమయంలో రోగుల కోసం వినియోగించాల్సిన వీల్ చైర్లను అక్కడి సిబ్బంది మందులు ఇతర వస్తువులు తరలించడానికి వినియోగిస్తున్నారు.

- ఏయూక్యాంపస్/ ఫొటో : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

ఢిల్లీలో ఈవీఎంల తారుమారు


- ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ విఫలం
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మీడియాతో మాట్లాడుతున్న కే ఏ పాల్

సీతమ్మధార: ఢిల్లీలో స్వేచ్ఛగా నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడంలో భారత ఎన్నికల కమిషన్ విఫలమైందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్ ఆరోపించారు. ఆయన ఆశీలమెట్టలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ వంటి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులను ఓడించడానికి బీజేపీ ఈవీఎంలను తారుమారు చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల దుర్వినియోగాల గురించి వారం ముందు ఆప్ నాయకుడు, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ను హెచ్చరించానని వెల్లడించారు. జాతీయ రాజకీయాల్లో తన ఆధిపత్యానికి సవాల్ విసురుతున్న ఏ రాజకీయ నాయకుడినైనా బీజేపీ లక్ష్యంగా చేసుకుని తొలగిస్తోందని హెచ్చరించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల సమగ్రతను కాపాడటానికి నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని ఆయన ప్రజలను, ప్రతిపక్ష పార్టీలను కోరారు. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఓట్లను లెక్కించినట్లయితే, వచ్చే ఎన్నికల్లో బీజేపీ 150 కంటే ఎక్కువ గెలుచుకోలేదన్నారు. 76 ఏళ్ల వయసులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రాజకీయాలు ఎందుకని ఎద్దేవా చేశారు. తనకు మద్దతిస్తే.. ఆట మొదలెడతానని అన్నారు. దేశంలో టాప్ 10 పొలిటికల్ పార్టీలు మోదీ ముందు లొంగిపోయాయని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు పూర్తిగా సందిగ్ధంలో ఉందన్నారు. ట్రంప్‌తో యుద్ధం చేసైనా తెలుగువాళ్లను కాపాడుకుంటానన్నారు. ఈ దేశానికి సేవ చేయడానికి రాజ్యసభ అవకాశం కోసం ఎదురుచూస్తున్నానన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి తెలుగు సినిమాలు లేకపోతే.. హాలీవుడ్‌లో అవకాశాలు ఇప్పిస్తానని వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ చెప్పిన సనాతన ధర్మం ఎక్కడుందని ప్రశ్నించారు.

అప్పన్నకు విశేషంగా భీష్మ ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.అంతకుముందుకు స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేంపజేశారు.

ముంచెత్తిన వ్యర్థాలు



నగరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలు, గెడ్డలను ముంచెత్తుతున్నాయి. జ్ఞానాపురం గెడ్డలో భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కనుచూపు మేర నీటిపై తేలుతూ ప్లాస్టిక్ వినియోగం ఏమేరకు జరుగుతుందో చాటి చెబుతోంది. వీటిని తొలగించడం పారిశుధ్య కార్మికులకు సైతం తలకుమించిన భారంగా మారుతోంది. అదే సమయంలో ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించడం కూడా ఎంతో అవసరం.

–ఏయూక్యాంపస్, ఫొటో: సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం